Follow: @ANNTELUGU
REGISTERED NUMBER
APTEL/2014/58382
05-02-2026
ANN తెలుగు
# మహా పత్రిక
తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 40 పేజీలు-04 వెల-రూ.6
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD గురువారం WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్



## పవన్.. ఓ దిష్టికల్యాణ్

- పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఫైర్
- మునిసిపల్ ఎన్నికల్లో బీజేపీకి గుండుసున్నానే


02



## ఈషా రెబ్బా సీరియస్

- అసభ్యపోస్టులపై బంజారాహిల్స్ పీఎస్ లో కంప్లైంట్


08



## వారణాసి సింగిల్ మూవీ

- రూమర్స్ కు జక్కన్న చెక్

02



# ఇదిగో నరవణే

### పబ్లిష్ కాలేదన్నారు.. ఇపుడేమంటారు?
### లోక్ సభలో రాహుల్ గాంధీ

**మహా:**ప్రధాని మోదీ లోక్‌సభకు వస్తారని నేను అనుకోవడం లేదు. ఎందుకంటే మోదీకి సభకు వస్తే నేను నేరుగా వెళ్లి ఆయనకు నరవణె రాసిన పుస్తకాన్ని ఇస్తాను. తద్వారా ఆ పుస్తకాన్ని చదివి మోదీ నిజాలను తెలుసుకుంటారు. ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ నరవణె రాసిన బుక్ లద్ధాఖ్‌లో జరిగిన ఘటనలను వివరిస్తుంది. దీనిని ముఖ్యంగా దేశంలోని యువత చదవాలి. కైలాష్ రిడ్జ్ ప్రాంతంలో చైనా దళాలు, వారి ట్యాంకుల మోహరింపు గురించి ఈ బుక్‌లో నరవణె హైలెట్ చేశారు. అని బుధవారం లోక్ సభ వద్ద ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఇదిగో నరవణే బుక్ పబ్లిష్ కాలేదన్నారు కదా అంటూ ప్రదర్శించారు. చైనా బలగాలు భారత భూభాగంలోకి ప్రవేశించినప్పటికీ, స్పష్టమైన అనుమతి లేని పక్షంలో భారత బలగాలు కాల్పులు జరపకూడదనేది ఆ సమయంలో టాప్ నుంచి అందిన స్టాండింగ్ ఆర్డర్ అని

మిగతా 2లో



### అందరి లెక్కలు
## తేలుస్తాం..

- మూడేళ్ళలో మళ్ళీ వస్తా...
- జగన్ వార్నింగ్
- అంబటి రాంబాబు కుటుంబానికి పరామర్శ

**గుంటూరు, మహా :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జంగిల్ రాజ్ నడుస్తోందని మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆరోపించారు. చంద్రబాబు పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని ఆరోపించారు. గుంటూరులో పర్యటించిన వైఎస్ జగన్.. అంబటి రాంబాబు కుటుంబాన్ని పరామర్శించారు.

మిగతా 2లో



## మున్సిపల్ ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ప్రచారం

- బీజేపీ తరపున ప్రచారం చేయనున్న ఏపీ డిప్యూటీ సీఎం
- పవన్ కళ్యాణ్‌ను కలిసిన కిషన్ రెడ్డి, రాంచందర్ రావు
- 7, 8 తేదీలలో ప్రచారానికి రానున్న పవన్

**హైదరాబాద్, మహా :** మునిసిపల్ ఎన్నికల్లో బీజేపీలో నూతనోత్సాహం కనిపిస్తోంది. జనసేన పార్టీ తెలంగాణలో బీజేపీకి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ త్వరలో తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రచారం చేయనున్నారు. ఎన్డీఏలో తమ మిత్రపక్షమైన బీజేపీ

మిగతా 2లో




### కొత్త ఏఐ టూల్స్‌తో..
## షేకయిన స్టాక్ మార్కెట్

ఆంథ్రోపిక్ ఏఐ అలజడి

3 లక్షల కోట్ల సంపద ఆవిరి

**మహా:**ఒక కొత్త ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాధనం టెక్ ప్రపంచంలో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. అమెరికాకు చెందిన 'ఆంథ్రోపిక్' అనే ఏఐ సంస్థ విడుదల చేసిన ఒక టూల్‌తో అటు వాల్‌స్ట్రీట్,

మిగతా 2లో

# భార్యాభర్తల ఫోన్లు ఎవరైనా వింటారా?

### ఛీ.. మీ బతుకులు చెడ.. మీ జాతి ఏంటి? నీతి ఏంటి?

- దోపిడీ చేసిన దొంగలు జాతిపిత ఎలా అవుతారు?
- కేటీఆర్, హరీష్ ను ముఖానికి నల్లముసుగేసి తీసుకురావాల్సింది
- మీ ఫామ్ హౌజ్ లు వేలకోట్ల ఆస్తులు ప్రజలకు రాసిస్తారా?
- ఇప్పటికైనా చేసిన తప్పులు ఒప్పుకుని నేలకు ముక్కు రాయండి
- నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో బీఆర్ఎస్ నేతలపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు
- నిరంతర అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్‌నే గెలిపించాలని పిలుపు



**మిర్యాలగూడ, మహా:**

"భార్యాభర్తలు మాట్లాడుకుంటే దొంగచాటుగా విన్న సన్నాసివి, నువ్వేలా జాతిపిత అవుతావు?" అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడలో బుధవారం జరిగిన 'ప్రజా పాలన ప్రగతిబాట' భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కేసీఆర్ కుటుంబంపై, బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు. కొంతమంది 'జాతిపిత'ను విచారిస్తారా అని అడుగుతున్నారని, అసలు "ఎవరికిరా నువ్వు జాతిపిత? హరీశ్ రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, కృష్ణారావు వంటి నేతలకు ఆయన జాతిపిత కావచ్చు.. కానీ ప్రజలకు ఆయనతో ఏం పని అని మండిపడ్డారు. నేరాలు, ఘోరాలు చేస్తే పోలీసులు ముసుగు వేసి పట్టుకుని వస్తారని.. హరీశ్ రావు, కేటీఆర్‌లను కూడా ముసుగు వేసి పట్టుకుని రావాల్సిందని అన్నారు. నీ జాతికి నువ్వు పిత కావొచ్చు.. మాకు కాదు" జడ్జిలను వదల్లే. జర్నలిస్టులను వదలలే. ప్రతిపక్ష నేతలను వదల్లే. భార్యభర్తలను వదల్లే. సినీతారలనే వదల్లే. మంది ఫోన్లు వినేటోడు మనిషైతడా? ఎవడేం మాట్లాడుకేంటే వీడికెందుకు? మానవ జన్మ ఎత్తడానికి అర్హత ఉందా? అన్నం తినేటోడు ఎవడైనా పెళ్ళాం మొగుళ్ళు మాట్లాడుకు నేటోళ్ళు వింటరా? వెయ్యి ఎకరాల్లో ఫామ్‌హౌస్ నిర్మించుకున్న మీలాంటోళ్లని.. జాతిపిత అంటే.. ఆత్మహత్య చేసుకుంటరు. బావిలో దూకి చస్తరు. నిజానికి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ముఖాలకు ముసుగులు తొడిగి పోలీసులు విచారణకు తీసుకురావాల్సింది" అని వ్యాఖ్యానించారు. జాతిపిత అయితే కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్, కేటీఆర్ జన్‌వాడ ఫామ్‌హౌస్, హరీశ్‌రావు మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లతో పాటు వేల కోట్ల ఆస్తులను తెలంగాణ ప్రజలకు రాసిస్తారా. మీ టీవీలు, మీ పేపర్లు మా తెలంగాణోళ్ళకు, నిరుద్యోగులకు ఇస్తవా అని సవాల్ విసిరారు.

మిగతా 2లో

### ముస్లిం ఓటు బ్యాంకు కోసం
# కాంగ్రెస్ ఆరాటం

- హిందూ దేవాలయాలపై దాడులు జరిగితే రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదు
- బుజ్జగింపు రాజకీయాలు చేస్తున్న రేవంత్ ప్రభుత్వం
- విజయ్ సంకల్ప్ సభలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్
- రాష్ట్రానికి తొలిసారి.. ఘనస్వాగతం పలికిన కాషాయ శ్రేణులు




**మహబూబ్ నగర్, మహా :** రాష్ట్రంలో సనాతన ధర్మం మీద జరిగే దాడులను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ హెచ్చరించారు. మహబూబ్ నగర్‌లోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన 'విజయ సంకల్ప్' సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ, ముస్లిం ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ ఆరాటపడుతోందని మండిపడ్డారు. రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నా నోరు మెదపడం లేదని, ఆలయాల భూములు ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. ముస్లిం సంతుష్టీకరణ విధానాలతో ఓటు బ్యాంక్ రాజకీయాలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని దుయ్యబట్టారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఎందరో పోరాడారని, హైదరాబాద్ విముక్తి కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి చేశారన్నారు. వక్ఫ్ బోర్డును బలోపేతం చేసేందుకు చూస్తోందని, ఇదే సమయంలో హిందూ దేవాలయాలు, సనాతన ధర్మంపై కక్షకట్టి వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో బలహీనవర్గాలకు న్యాయం జరగలేదని, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల నిధుల్లో ప్రభుత్వం కోత విధిస్తోందని ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

మిగతా 2లో

## జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కి క్లీన్‌చిట్

### అనర్హత పిటిషన్ ను కొట్టివేసిన స్పీకర్.. ఫిరాయింపు కేసులో కీలక పరిణామం



**హైదరాబాద్, మహా :** ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎమ్మెల్యే సంజయ్‌పై బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌ను స్పీకర్ కొట్టివేస్తూ, ఆయనకు క్లీన్ చిట్ ఇచ్చారు. సంజయ్ కుమార్ పార్టీ మారారు అనేందుకు తగిన ఆధారాలు లేవని, ఆయన సాంకేతికంగా బీఆర్ఎస్ సభ్యుడిగానే కొనసాగుతున్నారని స్పీకర్ తన తీర్పులో పేర్కొన్నారు.

### స్పీకర్ తీర్పుపై బీఆర్ఎస్ ఆగ్రహం

బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి వేసిన అనర్హత పిటిషన్‌ను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కొట్టివేస్తూ ఎమ్మెల్యే సంజయ్ కు క్లీన్ చిట్ ఇవ్వడాన్ని బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రాజ్యాంగ బద్ధంగా నడుచుకోవాలని స్పీకర్ కు, తెలంగాణ ప్రభుత్వానికి సూచిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో విచారణ పూర్తి చేసిన స్పీకర్, సుప్రీంకోర్టు గడువు లోపే తన నిర్ణయాన్ని వెలువరించారు. నియోజక వర్గ అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశానని, ఇప్పటికీ తన వేతనం నుంచి నెలకు రూ. 5 వేలు బీఆర్ఎస్ కు విరాళంగా వెళ్తున్నాయని పేర్కొన్నారు. తాను పార్టీ జెండా కప్పుకోలేదని ఎమ్మెల్యే చేసిన వాదనను స్పీకర్ పరిగణనలోకి తీసుకున్నారు. ఈ కేసుతో పాటు మొత్తం 10 మంది ఎమ్మెల్యేలపై బిఆర్ఎస్ అనర్హత వేటు వేయాలని కోరగా, ఇప్పటివరకు

మిగతా 2లో

## సినీ పరిశ్రకు కేంద్రంగా హైదరాబాద్

సమాజం కోసం, కళల ద్వారా జీవితాన్ని త్యాగం చేసిన మహనుభావుడు గద్దర్

గద్దర్ ఫిలిం అవార్డుల జ్యూరీ సభ్యుల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి



**హైదరాబాద్, మహా :** తెలుగు సినీ పరిశ్రమకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని, దేశవ్యాప్తంగా ఫిలిం ఇండస్ట్రీకి హైదరాబాదును కేంద్రంగా చేయాలన్న ఆలోచనతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం సెక్రటేరియట్ లో గద్దర్ సినిమా అవార్డుల జ్యూరీ సభ్యుల సమావేశంలో మాట్లాడుతూ, బాంబే, కలకత్తా, చెన్నై వంటి పట్టణాల్లో సినీ ఇండస్ట్రీ పెరగడానికి అంతగా అవకాశాలు లేవు కానీ దేశంలో ఉన్న అన్ని భాషల ఇండస్ట్రీ హైదరాబాద్ లో విస్తరించడానికి సానుకూల అంశాలు అనేకంగా ఉన్నాయన్నారు. సకల భాషల సినీ ఇండస్ట్రీ హైదరాబాద్ కు తరలి వస్తే రాష్ట్ర యువతకు, టెక్నీషియన్లు, రైటర్లు, డైరెక్టర్లకు ఉపాధి లభిస్తుందన్నారు. సినీ ప్రపంచ మార్కెట్ కు హైదరాబాద్ కేంద్రంగా మారుతుందన్నారు. ఇందుకు సంబంధించిన బ్లూ ప్రింట్ ప్రభుత్వం తయారు చేస్తుందన్నారు.

మిగతా 2లో



### లాయర్‌గా మారిన
## సీఎం మమత

దేశ చరిత్రలో ఇదే తొలిసారి

**ఈసీపై ఫైర్.. సుప్రీంలో వాదనలు**

**మహా:**పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ న్యాయవాదిగా మారారు. సుప్రీం కోర్టులో వాదనలు వినిపించారు. ఒక ముఖ్యమంత్రి నల్లకోటు వేసుకొని లాయర్‌గా మారి సుప్రీం కోర్టులో వాదనలు వినిపించడం దేశ చరిత్రలో

మిగతా 2లో

# అమరావతి ఔటర్..

### అన్ని జిల్లాలు కవర్ చేసేలా ప్లాన్



**అమరావతి, మహా:**ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని అన్ని జిల్లాలు కనెక్ట్ చేసేలా ఔటర్ రింగ్ రోడ్డు రాబోతోంది. అమరావతి ఓఆర్ఆర్‌కు సంబంధించి భూసేరణ ప్రక్రియ కూడా చేపట్టారు. గుంటూరు, పల్నాడుతో పాటుగా ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో భూసేకరణ చేపట్టారు. అయితే ఓఆర్ఆర్‌ను 140 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తారని ప్రతిపాదించారు. అయితే అమరావతి ఔటర్‌కు సంబంధించిన గెజిట్‌లో మాత్రం 250 మీటర్లుగా పేర్కొన్నారు. దీంతో రైతులు అధికారుల్ని అడిగి క్లారిటీ తీసుకుంటున్నారు.. 250 మీటర్లు ముందు జాగ్రత్త మాత్రమేనని.. ఓఆర్ఆర్‌ను మాత్రం 140 మీటర్ల వెడల్పుతోనే నిర్మిస్తామని అధికారులు చెబుతున్నారు. ఏమైనా ఔటర్ తో అమరావతి కనెక్టివిటీ ఈజీ కానుంది.

# హైదరాబాద్ మెట్రోపై బిగ్ అప్‌డేట్

- రెండో దశలో 5 కారిడార్లు, 76.4 కిలోమీటర్లు
- ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ. 24,269 కోట్లుగా అంచనా
- మెట్రో రైల్ కార్పొరేషన్ స్పష్టం

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ మెట్రో రెండవ దశ విస్తరణలో మొత్తం 76.4 కిలోమీటర్ల మేర కొత్త మార్గం నిర్మించనున్నారు. హైదరాబాద్ నగరవాసులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడంతోపాటు, నగరంలోని మరిన్ని ప్రాంతాలకు మెట్రో రైలును విస్తరించేందుకు ఈ హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2ను ఏర్పాటు చేయనున్నారు.

మిగతా 3లో



### మహిళా న్యాయవాది
## దారుణహత్య

సోదరుడే హంతకుడు.. ఆస్తి తగాదాలే కారణం

02



# భార్యాభర్తల ఫోన్లు ఎవరైనా వింటారా?

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ ఉద్యమకారుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు కనీసం చిన్న పదవి కూడా ఇవ్వలేదని ఆరోపించారు."ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ మొత్తం కనుమరుగైనా తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన సోనియమ్మ తెలంగాణ తల్లి అవుతుంది. తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ జాతిపిత అవుతాడు. లు*, సన్నాసి, దొంగ అయిన నువ్వెలా జాతిపిత అవుతావు?" అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి తీవ్ర పదజాలంతో విమర్శించారు.

**నక్కజిత్తుల భాస్కర్ రావు**

సభకు ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిర్యాలగూడలో రూ.200 కోట్లతో నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావును 'నమ్మకద్రోహి', 'నక్క జిత్తుల వ్యక్తి' అని అభివర్ణించారు. "జానారెడ్డి చెప్పులు, నీళ్లసీసాలు మోసిన భాస్కర్‌రావు, ఎమ్మెల్యేగా గెలిచాక ఆత్మగౌరవాన్ని ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ పాదాల దగ్గర పెట్టాడు. అలాంటి వ్యక్తికి మళ్లీ ఓటేస్తారా? గంగిరెద్దుల్లా ఓట్లు అడగడానికి వస్తే కర్రు కాల్చి వాత పెట్టండి" అని ప్రజలకు పిలుపునిచ్చారు.

**ప్రభుత్వ పథకాలే గెలిపిస్తాయి**

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి మున్సిపల్ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని ప్రజలను కోరారు. "పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. మేము లక్షలాది కార్డులిచ్చి సన్న బియ్యం అందిస్తున్నాం. ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతులకు ఎకరానికి రూ.6 వేల రైతు భరోసా, రూ.500 బోనస్‌తో పాటు రుణమాఫీ చేశాం. 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం" అని ప్రభుత్వ విజయాలను వివరించారు. ఓటు వేసే ముందు ఈ పథకాలన్నింటినీ గుర్తు చేసుకోవాలని కోరారు. మున్సిపల్ శాఖ తన వద్దే ఉందని, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే పట్టణాలను అద్దంలా తీర్చిదిద్దే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ప్రచారం



(మొదటిపేజీ తరువాయి)

అభ్యర్థుల గెలుపు కోసం ఫిబ్రవరి 7, 8 తేదీల్లో పవన్ కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేయనున్నారు.

**పవన్ కళ్యాణ్‌తో బీజేపీ కీలక నేతలు భేటీ**

తెలంగాణ బిజెపి ముఖ్య నేతలు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను హైదరాబాద్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు పాల్గొన్నారు. ఇరుపార్టీల రాజకీయ బంధాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ భేటీ సాగింది. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని ప్రస్తుత రాజకీయ పరిణామాలు, అభివృద్ధి అంశాలపై నేతలు సుదీర్ఘంగా చర్చించారు. తెలంగాణలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల వ్యూహాలపై ఈ భేటీలో చర్చించారు. జనసేనాని తమ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయాలని బీజేపీ నేతలు పవన్ కళ్యాణ్‌ను కోరారు. జనేసేన, బీజేపీ నేతల మధ్య సమన్వయం ద్వారా ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని నేతలు అభిప్రాయపడ్డారు. అనంతరం బీజేపీ నేతలు మాట్లాడుతూ.. తెలంగాణ మున్సిపల్ ఎన్నికలలో బిజెపికి జనసేన పార్టీ పూర్తి మద్దతు ప్రకటించిందని తెలిపారు. కేవలం మద్దతు ఇవ్వడమే కాకుండా, బిజెపి అభ్యర్థుల గెలుపు కోసం పవన్ కళ్యాణ్ స్వయంగా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటారని ప్రకటించారు. ఈ పొత్తు తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీసే అవకాశం ఉంది.

**ట్విట్టర్ వేదికగా బీజేపీ ప్రకటన**

పవన్ కళ్యాణ్ బీజేపీ తరఫున ప్రచారం చేయనున్నారని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు తన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తెలిపారు. పవన్ కళ్యాణ్ బీజేపీకి పూర్తి మద్దతు ప్రకటించారని, ఎన్నికల ప్రచారానికి అంగీకరించారని ఆయన పేర్కొన్నారు. ఇరు పార్టీల ఉమ్మడి ప్రచారం తెలంగాణ పురపాలక ఎన్నికల్లో అధికార పార్టీ కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలకు గట్టి పోటీనిచ్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కి క్లీన్‌చిట్

(మొదటిపేజీ తరువాయి)

సంజయ్ కుమార్‌తో కలిపి మొత్తం ఎనిమిది మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చిట్ ఇచ్చినట్లయింది. గతంలో పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్యలకు సైతం స్పీకర్ క్లీన్ చిట్ ఇచ్చారు. స్పీకర్ నిర్ణయాలపై బీఆర్ఎస్ వర్గాలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నాయి. స్పష్టమైన ఆధారాలు ఉన్నప్పటికీ స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని, దీనిపై ఉన్నత న్యాయస్థానాల్లో పోరాటం చేస్తామని ఆ పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు.

**బీఆర్ఎస్ నుంచే గెలిచా.. ఆ పార్టీలోనే కొనసాగుతా: ఎమ్మెల్యే సంజయ్**

తన వేతనం నుంచి ప్రతినెలా రూ.5 వేలు బీఆర్ఎస్ కోసం వెళ్తాయని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీలో ప్రవేశపెట్టే బిల్లులకు విప్ జారీ చేస్తే తాను మద్దతు ఇస్తానని చెప్పారు. తాను బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచానని, ఆ పార్టీ ఎమ్మెల్యేగానే కొనసాగుతా అన్నారు.

**మొత్తం 8 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చిట్**

ప్రకాష్‌గౌడ్, అరికపూడి గాంధీ, బండ్ల కృష్ణమోహన్, గూడెం మహిపాల్ రెడ్డి, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్యలకు తెలంగాణ స్పీకర్ ఇదివరకే క్లీన్ చిట్ ఇచ్చారు. తాజాగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సైతం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేనే అని, పార్టీ మారారని చెప్పడానికి ఎలాంటి ఆధారాలు లేవని ప్రకటించారు. మరో ఎమ్మెల్యే కడియం శ్రీహరికి స్పీకర్ నోటీసులు జారీ చేయగా, బుధవారం ఉదయం స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే అనర్హత పిటిషన్లపై విచారణకు హాజరయ్యారు.

**స్పీకర్ నిర్ణయానన్ని తప్పుపడుతూ కేటీఆర్ ట్వీట్**

"ఓవైపు జగిత్యాలలో మున్సిపల్ ఎన్నికల వేళ అసలు కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి దుమ్మెత్తిపోస్తున్న తరుణంలోనే ఫిరాయింపు ఎమ్మెల్యేకు క్లీన్ చిట్ ఇవ్వడం స్పీకర్ పదవికున్న గౌరవాన్ని దెబ్బతీయడమే. పార్టీ ఫిరాయింపుల సూత్రధారి ఢిల్లీకి పంపే మూటలకు ఆశపడి మౌనం వహిస్తున్న రాహుల్ గాంధీకి ఇకనుంచి రాజ్యాంగాన్ని పట్టుకుని తిరిగే నైతిక హక్కు లేదు. పట్టపగలే పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించినా ఒక్కరిపై కూడా చర్య తీసుకోకుండా సీఎం నడిపిస్తున్న ఈ వికృత రాజకీయ క్రీడకు ప్రజాక్షేత్రంలోనే గుణపాఠం తప్పదు" అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

# సినీ పరిశ్రకు కేంద్రంగా హైదరాబాద్

(మొదటిపేజీ తరువాయి)

గత ప్రభుత్వం కొన్నేళ్ళ పాటు సినీ రంగానికి సంబంధించిన అవార్డుల విషయంలో నిర్లక్ష్యం వహించి వదిలేస్తే సమాజంలో అత్యంత ప్రభావం చూపే సామాజిక పరివర్తన తీసుకొచ్చే సినీ రంగాన్ని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అవార్డులు ఇచ్చి తిరిగి ప్రోత్సహించడం ప్రారంభించిందన్నారు. సమాజం కోసం కళల ద్వారా తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహానుభావుడు గద్దర్ అని డిప్యూటీ సీఎం తెలిపారు. తెలంగాణ అంటే కళలు, విప్లవం, ప్రశ్నించడం, సున్నిత మనసుతో, ప్రేమానురాగాలతో కూడినదని, తెలంగాణ కళలు, సంస్కృతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి గద్దర్ అని తెలిపారు. అందుకే వారి పేరు మీద గత సంవత్సరం నుండి సినిమా అవార్డులు ఇవ్వడం ప్రారంభించి సినీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ, పారదర్శకతలే ప్రమాణంగా సినిమా అవార్డుల ఎంపిక ఉంటుందన్నారు. సినీ రంగ ప్రముఖులకు ఉన్న అనుభవాన్ని, నిబద్ధతను, సినిమా రంగం పట్ల వారికున్న అభిమానాన్ని దృష్టిలో పెట్టుకొని ఎఫ్ డిసి ద్వారా అందరితో సంప్రదింపులు జరిపి జ్యూరీ సభ్యులుగా ఎంపిక చేశారని, ప్రభుత్వ నుంచి కావలసిన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందజేస్తామని తెలిపారు. ప్రతి పని సమాజానికి ఉపయోగపడాలి, ప్రజలకు జవాబు దారిగా ఉండాలన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. గద్దర్ అవార్డుకు ఎంపిక చేసే సినిమాలో కమర్షియల్ అంశంతో పాటు సామాజిక సందేశం తప్పనిసరిగా ఉండేలా జాగ్రత్త తీసుకుంటే రాబోయే రోజుల్లో సమాజంలో మంచి సినిమాలను ప్రోత్సహించేందుకు అవకాశం ఉంటుందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈనెల 6 నుంచి గద్దర్ సినిమా అవార్డుల స్క్రీనింగ్ కార్యక్రమం ప్రారంభమవుతుంది. 19న ఉగాది పండుగ రోజు గద్దర్ అవార్డుల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని తెలిపారు. సమావేశంలో ఎఫ్ డీసీ చైర్మన్ దిల్ రాజు, సమాచార శాక కమిషనర్ ప్రియాంక, ఎఫ్ డీసీ ఈడీ కిషోర్ బాబుతో పాటు సినీ ప్రముఖులు తనికెళ్ల భరణి, కేఎస్ రామారావు, రోజా రమణి, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం ఓటు బ్యాంకు కోసం

# కాంగ్రెస్ ఆరాటం

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల హామీలను తుంగలో తొక్కిందని మండిపడ్డారు. రైతు భరోసా, రుణమాఫీ, నిరుద్యోగ భృతి, మహిళలకు స్కూటీలు, మహిళలకు రూ. 2500 నగదు జమ, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలు కూడా నెరవేరలేదని అన్నారు. ఎస్సీలు, ఆదివాసీలు, బీసీలను తెలంగాణ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులు, బిల్లుల మంజూరుకు ఆర్ఆర్ ట్యాక్స్ చెల్లించవలసి వస్తోందని అన్నారు. అవినీతి, కమీషన్ల ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించాలని నితిన్ నబీన్ పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరికి న్యాయం జరగాలంటే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ప్రాధాన్యత ఇస్తోందని, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో అభివృద్ధి శరవేగంగా జరుగుతుంటే తెలంగాణలో అవినీతి దూసుకు పోతుందన్నారు. తెలంగాణలో రైల్వే పనులకు రూ.5,400 కోట్లకు పైగా కేటాయించామని, మూడు హైస్పీడ్ రైల్ రైళ్లను ఇచ్చామని గుర్తు చేశారు. రాష్ట్రంలోని పట్టణాల అభివృద్ధికి కేంద్రం ఇతోధికంగా నిధులు ఇస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా మోదీ ప్రభుత్వం పట్ల ఆదరణ పెరుగుతోందని అన్నారు. ఈయూతో ఒప్పందం చేసుకుని దేశాభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అన్ని వర్గాలు, ప్రాంతాల ప్రజలకు సమన్యాయం చేస్తున్నారన్నారు.

**పాలమూరు గడ్డ...బిజెపి అడ్డా : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

ప్రస్తుత ముఖ్యమంత్రి, గత ముఖ్యమంత్రి మహబూబ్ నగర్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించినప్పటికీ జిల్లా అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. పాలమూరు బిడ్డలు బీజేపీని ఎప్పుడూ ఆదరించి అక్కున చేర్చుకుంటున్నారని, మునిసిపల్ ఎన్నికల్లోనూ ఆదే తరహా ఆదరించి ఆశీర్వదించాలన్నారు. రేవంత్ రెడ్డి సీఎంగా రెండేళ్ళు పూర్తి చేసుకున్నా జిల్లాకు, రాష్ట్రానికి ఒరగబెట్టింది ఏమీ లేదని విరుచుకుపడ్డారు. రేవంత్ మాటలు కోటలు దాటుతాయి కానీ పనులు పాలమూరు జిల్లాకు రావడం లేదన్నారు. కేసీఆర్ హయాంలో బీఆర్ఎస్ అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడిందని, తనను సీఎం చేస్తే అవినీతికి పాల్పడిన కేసీఆర్ ప్రభుత్వంలోని దోషులను చర్లపల్లి జైలుకు పంపిస్తానని చెప్పిన రేవంత్ ఇప్పుడు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ కు రాహుల్ గాంధీకి ఒప్పందాలు కుదిరాయి కాబట్టే



రేవంత్ ప్రభుత్వంపై వీళ్లపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. కాంగ్రెస్‌బీఆర్ఎస్ దొందూ దొందేనని, మా ప్రభుత్వం కొట్టినట్లు చేస్తుంది, మీరు ఏడ్చినట్లు చేయండి అనేలా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారన్నారు బీఆర్ఎస్ హయాంలో ఫోన్ ట్యాపింగ్ భయానకంగా జరిగింది. భార్యభర్తలు మాట్లాడుకున్న విషయాలను కూడా కేసీఆర్ ప్రభుత్వంలో టాప్ చేసి విన్నారు. సినీ హీరోయిన్లు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు మాట్లాడిన మాటలు కూడా ఫోన్ ట్యాపింగ్‌లో గమనించారు. విలేకరులు, మీడియా మేనేజ్‌మెంట్ ఫోన్లను కూడా టాప్ చేసారు. చివరికి తమ సొంత పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు కూడా ఫోన్లలో సంభాషించిన మాటలను విన్నారు. పోలీసులతో పాటు బిజెపి నాయకుల ఫోన్లను కూడా ట్యాప్ చేసి వారి మాటలు విన్నారన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణను సీరియల్‌గా సాగదీయడం తప్ప, అసలు దోషులైన నాయకులపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. తెలంగాణ అభివృద్ధి జరగాలంటే, అవినీతిరహిత పాలన రావాలంటే, నీతి, నిజాయితీతో సమర్థ పాలన రావాలంటే... నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో, నితిన్ నబిన్ గారి నాయకత్వంలో తెలంగాణలో బిజెపి జెండా ఎగురాలన్నారు. మొన్నటి ఎంపీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు ఒక అడుగు వేసి 8 ఎంపీ సీట్లలో బిజెపిని గెలిపించారని, ఈ మున్సిపల్ ఎన్నికల్లో మరో అడుగు ముందుకేసి బిజెపి గెలిపించాలని కోరారు. తెలంగాణలో అవినీతి, అక్రమాల, మాటల ప్రభుత్వానికి వ్యతిరేకంగా మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను ఆశీర్వదించి మెజారిటీ చైర్మన్లను బిజెపి అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

**కాంగ్రెస్ మతోన్మాదులను ప్రేరేపిస్తుంది : రాంచందర్ రావు**

కాంగ్రెస్ ఈజ్ ముస్లిం.. ముస్లిం ఈజ్ కాంగ్రెస్ అని జూబ్లిహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా మాట్లాడిన కాంగ్రెస్ ఇప్పుడు బీజేపీపై తప్పుడు ప్రచారం చేస్తుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మండిపడ్డారు. రాష్ట్రంలో అనేక దేవాలయాలను విచ్చలవిడిగా కూల్చివేస్తున్న మతోన్మాదులను పట్టుకోకుండా, వారిపై చర్యలు తీసుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చోద్యం చూస్తోందని దుయ్యబట్టారు. మతోన్మాదులకు ఆసరా కల్పిస్తూ వదిలేస్తున్న కాంగ్రెస్ పార్టీకి మునిసిపల్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. "రాష్ట్రంలో దేవాలయాలను కూల్చేవాళ్లను, సనాతన ధర్మాన్ని కించపర్చేవాళ్లను, హిందువుల మనోభావాలను కించపర్చేవారిని బీజేపీ అడ్డుకుంటోందని, దీన్ని జీర్ణించుకోలేని టీపీసీసీ చీఫ్ బీజేపీ మతోన్మాదం చేస్తోందని మాట్లాడటం దారుణమన్నారు. నిజానికి మతోన్మాదులకు ఆసరా కల్పిస్తున్న కాంగ్రెస్ పార్టీయే అని, నిజమైన మతోన్మాద పార్టీ కాంగ్రేసేనని అన్నారు. బీజేపీ అంటే కాంగ్రెస్ భయపడుతోందని, అందుకే సీఎం మీటింగ్ పెడితే చాలు బీజేపీ కార్యకర్తలను అరెస్టు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 90 శాతం మున్సిపాలిటీలు గెలుస్తామంటూ కాంగ్రెస్ నేతలు విర్రవీగుతున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ "సారు.. కారు.. పదహారు.." అంటూ మాట్లాడిందని, ఇప్పుడు ఆ పార్టీ ఇప్పుడు ఎక్కడుందో చూస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీకి కూడా అదే గతి పడుతుందన్నారు. మొన్నటి పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ 5 వేల స్థానాల్లో పోటీ చేసి సుమారు వెయ్యి మంది వరకు సర్పంచులు, 10 వేల మంది వార్డు మెంబర్లు, 1200 మంది ఉపసర్పంచులను గెలిచిందన్నారు. బీజేపీ అంటే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు భయపడుతున్నాయన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి అత్యధిక సీట్లలో గెలుస్తుందన్న ధీమాను వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు ఏమిచ్చారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో మహబూబ్ నగర్‌కు, నల్లగొండకు ఏమిచ్చారో చెప్పాలన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బిజెపిని అత్యధిక స్థానాల్లో గెలిపిస్తే, ప్రధానమంత్రితో స్వయంగా చర్చించి అభివృద్ధి కోసం నిధులు తీసుకొచ్చే బాధ్యత మేం తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ట్యాక్స్‌లు పెంచి భారం మోపుతారు, బీఆర్ఎస్‌ను గెలిపిస్తే మళ్లీ దోపిడీ చేస్తారన్నారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావడం, బిజెపి ప్రభుత్వం ఏర్పడటం ఖాయమన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

## అందరి లెక్కలు

# తేలుస్తాం..

(మొదటిపేజీ తరువాయి)

అంబటి ఇంటిని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన వైఎస్ జగన్.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మీద, సీఎం చంద్రబాబుపైనా ఓ రేంజులో విరుచుకుపడ్డారు. అంబటి రాంబాబు, విడదల రజిని, జోగి రమేష్, బొల్లా బ్రహ్మనాయుడు చేసిన తప్పేంటని ప్రశ్నించారు. ఎల్లకాలం ఇదే ప్రభుత్వం ఉండదన్న జగన్.. వచ్చేది తమ ప్రభుత్వమేనని అన్నారు. ఇలాంటి చర్యలతో భయపడతామనుకుంటే చంద్రబాబు అంత మూర్ఖుడు ఉండరంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. దేవుడంటే చంద్రబాబుకు భక్తీ, భయం రెండూ లేవన్న జగన్.. తిరుమల నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని కుట్రపూరితంగా తప్పుడు ప్రచారం చేశారన్నారు. తిరుమల ప్రతిష్ఠతను దెబ్బతీసేలా ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. ఎన్‌డీడీబీ, ఎన్‌డీఆర్ ల్యాబ్‌లు కూడా తిరుమల నెయ్యిలో కల్తీ జరగలేదని నివేదికలు ఇచ్చాయని.. సీబీఐ ఆధ్వర్యంలో ఈ టెస్టులు జరిగాయని జగన్ వివరించారు. జగన్ పర్యటన సందర్భంగా వైసీపీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున గుంటూరుకు తరలివచ్చారు.

## లాయర్‌గా మారిన

# సీఎం మమత

(మొదటిపేజీ తరువాయి)

ఇదే తొలిసారి. ఈ ఘనతను మమతా బెనర్జీ సాధించారు .ఎస్ఐఆర్ పేరుతో బెంగాల్‌లో 58 లక్షల ఓటర్లను తొలగించారని ఆరోపిస్తూ.. సర్వోన్నత న్యాయస్థానంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సవాల్ చేశారు. ఈ కేసులో బుధవారం స్వయంగా ఆమె సుప్రీంకోర్టుకు వెళ్లి తన వాదనలు వినిపించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఛాంబర్‌కు వెళ్లిన దీదీ.. తన వాదనలు వినిపించడానికి ఐదు నిమిషాల సమయం కోరారు. దీనికి సీజేఐ అంగీకరిస్తూ.. 15 నిమిషాలు తీసుకోండని చెప్పారు. న్యాయం మూసిన తలుపుల వెనుక ఏడుస్తోందని మమతా బెనర్జీ ఆవేదన వ్యక్తం చేశారు. 'సార్.. సమస్య ఏమిటంటే... చివరికి మాకు ఎక్కడా న్యాయం జరగడం లేదు. నేను ఈసీఐకి ఆరుసార్లు లేఖలు రాశాను.. అయినా ఇప్పటికీ ఎలాంటి సమాధానం రావడం లేదు. న్యాయం మూసిన తలుపుల వెనుక రోదిస్తోంది' అంటూ ముఖ్యమంత్రి తన వాదనలను ప్రారంభించారు. దీంతో ఈ అంశం ఎన్నికల కమిషన్‌పై పూర్తిస్థాయి దాడిగా మారింది. మమతా బెనర్జీ అభ్యర్థన నిజమైనదని ధర్మాసనం అంగీకరించింది. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని హామీ ఇచ్చింది. బెంగాల్ సీఎం పిటిషన్‌పై ఎన్నికల సంఘానికి ధర్మాసనం నోటీసు కూడా జారీ చేసింది.

## కొత్త ఏఐ టూల్స్ తో..

# షేకయిన స్టాక్ మార్కెట్

### ఆంత్రోపిక్ ఏఐ అలజడి.. 3లక్షల కోట్ల సంపద ఆవిరి

(మొదటిపేజీ తరువాయి)

ఇటు భారత స్టాక్ మార్కెట్లలో ఐటీ షేర్లు కుదేలయ్యాయి. ఈ పరిణామంతో ఒక్కరోజే సుమారు 300 బిలియన్ డాలర్ల సంపద ఆవిరైపోవడం గమనార్హం. ఇప్పటికే యూనియన్ బడ్జెట్ ప్రభావంతో ఒత్తిడిలో ఉన్న భారత ఐటీ రంగానికి ఇది మరో గట్టి దెబ్బగా మారింది. ఆంత్రోపిక్ అనేది అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కో కేంద్రంగా 2021లో ఏర్పాటైన ఒక ఏఐ పరిశోధన సంస్థ. ఓపెన్‌ఏఐ మాజీ సభ్యులు డేనియలా అమోడి, డారియో అమోడి దీనిని స్థాపించారు. ఈ సంస్థ 'క్లాడ్' పేరుతో శక్తివంతమైన లార్జ్ లాంగ్వేజ్ మోడల్‌స్‌ను అభివృద్ధి చేసింది. సురక్షితమైన ఏఐ టెక్నాలజీని రూపొందించడమే తమ లక్ష్యమని కంపెనీ చెబుతోంది. దీని సామర్థ్యాన్ని గుర్తించిన అమెజాన్, గూగుల్ వంటి దిగ్గజ సంస్థలు భారీగా పెట్టుబడులు పెట్టాయి. అమెజాన్ 4 బిలియన్ డాలర్లు, గూగుల్ 2 బిలియన్ డాలర్ల వరకు పెట్టుబడులకు కట్టుబడి ఉన్నాయి. ప్రస్తుతం ఆంత్రోపిక్ మార్కెట్ విలువ సుమారు 350 బిలియన్ డాలర్లుగా అంచనా.

**టూల్స్ తో ఐటీసంస్థల భవిష్యత్తు డేంజర్**

బుధవారం రోజున ఆంత్రోపిక్ సంస్థ కార్పొరేట్ న్యాయ బృందాల కోసం కొన్ని కొత్త ఏఐ టూల్‌స్‌ను విడుదల చేసింది. తమ క్లాడ్ ఏఐ అసిస్టెంట్‌లో భాగంగా పనిచేసే ఈ టూల్స్.. కంపెనీల కాంట్రాక్టుల పరిశీలన, ఎన్‌డీఏల సమీక్ష, న్యాయపరమైన సారాంశాల తయారీ వంటి సాధారణ పనులను సులువుగా పూర్తి చేయగలవు. ఈ ప్రకటన వెలువడిన వెంటనే, ఐటీ సేవల సంస్థల భవిష్యత్తుపై ఆందోళనలు మొదలయ్యాయి. ఇలాంటి సాధారణ పనుల ఆటోమేషన్ వల్ల ఐటీ కంపెనీల ఆదాయం దెబ్బతింటుందనే భయాలతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు తెగబడ్డారు. ఫలితంగా వాల్‌స్ట్రీట్‌లోని నాస్‌డాక్ ఇండెక్స్ 1.43% పతనం కాగా, సాఫ్ట్‌వేర్, ఫైనాన్షియల్ డేటా స్టాక్‌స్‌లో సుమారు 300 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ ఆవిరైంది.

**అమెరికా, భారత్ మార్కెట్లపై ఎఫెక్ట్**

అమెరికా మార్కెట్ల పతనం భారత ఐటీ రంగంపైనా తీవ్రంగా పడింది. ఎన్ఎస్ఈలో నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఏకంగా 5.9% నష్టపోయింది. ఏప్రిల్ 7, 2025 తర్వాత ఒకేరోజులో ఈ స్థాయిలో పతనం కావడం ఇదే తొలిసారి. దేశంలోని ప్రముఖ ఐటీ కంపెనీల షేర్లు భారీగా నష్టపోయాయి. ఎల్‌టీఐమైండ్‌ట్రీ 7.6%, పర్సిస్టెంట్ సిస్టమ్స్ 7.5%, విప్రో 6.7%, ఇన్ఫోసిస్ 6.2%, టీసీఎస్ 6% మేర నష్టపోయాయి. గ్లోబల్ టెక్ అమ్మకాల ఒత్తిడి, బడ్జెట్ అనంతర పరిణామాలు కలిసి భారత ఐటీ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి.

# మహిళా న్యాయవాది దారుణహత్య

### సోదరుడే హంతకుడు.. ఆస్తి తగాదాలే కారణం

**మొయినాబాద్, మహా :** రంగారెడ్డి జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. సొంత అన్న చేతిలో మహిళా న్యాయవాది స్వప్న (34) హత్యకు గురయ్యారు. మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల కోర్టులో స్వప్న న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆమె కుటుంబంలో ఆస్తి గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో బుధవారం ఉదయం పొలం వద్ద పంచాయతీ జరుగుతుండగా స్వప్నను సోదరుడు రాజు హతమార్చాడు. హత్య సమాచారం అందుకున్న మొయినాబాద్ పోలీసులు.. ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

**రాజు మూడేళ్లుగా పథకం పన్నాడు: తల్లి వెంకటమ్మ**

స్వప్నను చంపాలని రాజు మూడేళ్లుగా పథకం పన్నాడని తల్లి వెంకటమ్మ అన్నారు. హతమార్చేందుకు ఇప్పటికే రెండుసార్లు యత్నించాడని చెప్పారు. భూమి సర్వే అనంతరం తిరిగి వెళ్తుండగా స్వప్నపై ముగ్గురు వ్యక్తులు దాడి చేశారని తెలిపారు. కర్రలు,



కత్తులతో దాడి చేశారని, రాజుతో పాటు నిందితులను కఠినంగా శిక్షించాలని వెంకటమ్మ కోరారు.

**న్యాయవాదుల ఆందోళన**

స్వప్న హత్యపై చేవెళ్ల కోర్టు న్యాయవాదులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం విధులను బహిష్కరించి మొయినాబాద్ పీఎస్ వద్ద ఆందోళనకు దిగారు. పీఎస్ ఎదుట ఉన్న హైదరాబాద్‌బీజాపూర్ హైవేపై బైఠాయించి నిరసన తెలిపారు.

# వారణాసి సింగిల్ మూవీ

### రూమర్స్ కు జక్కన్న చెక్

**మహా:** రాజమౌళి దర్శకత్వంలో రూపొందే ఏ సినిమాకైనా పబ్లిసిటీతో అవసరం లేకుండా బజ్ క్రియేట్ అవుతూనే ఉంటుంది. అయితే ఈ సారి ఇంటర్నేషనల్ ఎరీనాను టార్గెట్ చేస్తూ రాజమౌళి మహేశ్‌బాబు తో వారణాసి చిత్రం రూపొందిస్తున్నారు. ఈ సినిమాను 2027 ఏప్రిల్ 7న విడుదల చేస్తామని ప్రకటించారు. హాలీవుడ్ జనం ముందుగానే తమ సినిమాల రిలీజ్ డేట్ చెప్పేసి, తరువాత సదరు చిత్రాలకు సంబంధించిన విశేషాలను విడుదల చేస్తూ ఉంటారు. అలాగే ఇప్పుడు 'వారణాసి' సినిమా అంటార్కిటికాలో షూటింగ్ కు ముస్తాబవుతూ ఉన్న విషయాన్ని తెలిపారు. 'వారణాసి' రెండుపార్ట్ లపై జరుగుతున్న ప్రచారాన్ని జక్కన్న ఖండించారు. సింగిల్ సినిమాగానే జనం ముందుకు వస్తుందని తెలిపారు. ఈ సినిమా రన్ టైమ్ మూడు గంటల ఇరవై నిమిషాలు ఉంటుందనీ సమాచారం.

# పవన్.. ఓ దిష్టికల్యాణ్

### పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఫైర్

మునిసిపల్ ఎన్నికల్లో బీజేపీకి గుండుసున్నానే

**హైదరాబాద్, మహా :** పవన్ కల్యాణ్ తెలంగాణలో ప్రచారం చేస్తారన్న ప్రకటనపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఘాటుగా స్పందించారు. పవన్.. ఓ దిష్టి కల్యాణ్ అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. పవన్ కల్యాణ్ రాజకీయాలు ఏపీలో చేసుకోవాలని ఆయన తెలంగాణ వ్యతిరేకి అని, గతంలో తెలంగాణ గురించి నీచంగా మాట్లాడారని విమర్శించారు. పవన్ చెప్పారని ఇక్కడ ఎవరూ ఓటు వేయరన్నారు. ఇవాళ గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్ ఈ మేరకు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇలాగే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి గుండు సున్నా రాబోతోందని జోస్యం చెప్పారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో మతం పేరుతో రెచ్చగొట్టిన ఆ పార్టీకి డిపాజిట్ కూడా దక్కలేదని ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లోనూ మున్సిపల్ ఎన్నికల్లో మరోసారి మతం పేరుతో బీజేపీ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడి రాక అందులో భాగమే తెలంగాణ ప్రజలారా తస్మాత్ జాగ్రత్త ఉండాలని హెచ్చరించారు. మత వైషమ్యాలకు అతీతంగా సోదరభావంతో మెలిగే తెలంగాణ ప్రజలు బీజేపీని ఆదరించరన్నారు. భైంసా అల్లర్ల వల్లే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి సంక్షేమం పేరుతో ఓట్లు అడుగుతుందని తెలంగాణ ప్రజలు మున్సిపల్ ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఇదిగో నరవణే

### పబ్లిష్ కాలేదన్నారు.. ఇపుడేమంటారు?

### లోక్ సభలో రాహుల్ గాంధీ




(మొదటిపేజీ తరువాయి)

రాహుల్ ఆరోపించారు. "చైనా బలగాలు భారత భూభాగంలోకి వచ్చినా, తమ అనుమతి లేకుండా వారిపై కాల్పులు జరపకూడదని 'టాప్' స్టాండింగ్ ఆర్డర్. అయితే అప్పటి సైన్యాధిపతి నరవణె భారత భూభాగంలోకి వచ్చిన చైనా ట్యాంకులపై కాల్పులు జరపాలనుకున్నారు. అయితే మోదీ మీకు ఏది సరైనదని అనిపిస్తే అది చేయండన్నట్లు సందేశం ఇచ్చారు. అందుకే ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ నరవణె తన పుస్తకంలో తాను ఒంటరినయ్యాని రాసుకొచ్చారు. అంటే మోదీ తన బాధ్యతలను సరిగ్గా నిర్వర్తించలేదని అర్థం. ప్రధాని మోదీ ఈ సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించాలి. లద్ధాఖ్ ప్రతిష్టంభన సమయంలో తన పాత్రను దేశ ప్రజలకు వివరించాలి. దేశానికి జాతీయ భద్రత విషయంలో పారదర్శకత, జవాబుదారీతనం అవసరం." అని రాహుల్ పేర్కొన్నారు.

**రాహుల్ వర్సెస్ కేంద్ర మంత్రి**

మరోవైపు, పార్లమెంట్ వెలుపల రాహుల్ గాంధీ, కేంద్ర రైల్వే సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు మధ్య మాటల యుద్ధం నడిచింది. పార్లమెంట్‌లోని మకర్ ద్వార్ వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ ఎంపీల పక్క నుంచి వెళ్తున్న రవ్‌నీత్ సింగ్ బిట్టును రాహుల్ గాంధీ 'ద్రోహి' అని సంబోధించారు. 2024లో రవ్‌నీత్ బిట్టు కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరడంతో రాహుల్ ఆయన్ను ద్రోహిగా అభివర్ణించారు. 'ఇదిగో ఒక ద్రోహి పక్కన నడుస్తున్నాడు. ఆయన ముఖం చూడండి.' అని రాహుల్ వ్యాఖ్యానించారు. అలాగే బిట్టుతో కరచాలనం చేయడానికి ముందుకొచ్చారు. 'మీరు చింతించకండి. కాంగ్రెస్‌లోకి తిరిగివస్తారు' అని బిట్టుతో రాహుల్ అన్నారు. అయితే రాహుల్ కరచాలనం చేయడానికి ముందుకు రాగా కేంద్ర మంత్రి రవ్‌నీత్ నిరాకరించారు. ఈ క్రమంలో రాహుల్‌పై విరుచుకుపడ్డారు. దేశానికి శత్రువుగా రాహుల్‌ను అభివర్ణించారు. నిరసనలు తెలుపుతున్న ఎంపీలు యుద్ధంలో గెలిచినట్లుగా కూర్చున్నారని ఎద్దేవా చేశారు.



## వారణాసిలో రాముడిగా..
# ఇష్టమైన ఫుడ్ అదే!

దర్శకధీరుడు రాజమౌళి ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న మూవీ వారణాసి. మహేశ్‌బాబు హీరోగా, ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా, పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా నటిస్తున్నారు. 2025 చివర్లో వారణాసి గ్లింప్స్ రిలీజ్ చేయగా మూవీకి భారీ హైప్ వచ్చింది. ఈ మధ్యే సినిమా రిలీజ్ డేట్ కూడా ప్రకటించారు. 2027 ఏప్రిల్ 7న విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. తాజాగా చిత్రయూనిట్ హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూను రిలీజ్ చేసింది.

**స్టార్‌గా మారిందే ఆ సినిమాతో**

అందులో మహేశ్‌బాబు తనకు స్టార్‌డమ్ తెచ్చిన సినిమా ఏదో వెల్లడించాడు. అలాగే వారణాసిలో తన క్యారెక్టర్ గురించి మాట్లాడాడు. 'పోకిరి సినిమా నన్ను స్టార్‌గా నిలబెట్టింది. ఆ మూవీ చాలా పెద్ద విజయం సాధించింది. వారణాసి విషయానికి వస్తే.. రాజమౌళి నాకు ఈ కథ చెప్పగానే ఆశ్చర్యపోయాను. తర్వాత ఓసారి.. మీ దర్శకత్వంలో చేయడం ఆనందంగా ఉంది. మీరు హీరోలను చాలా బాగా చూపిస్తారు, మీకు హీరోలంటే చాలా ప్రేమ అని రాజమౌళికి మెసేజ్ పెట్టాను. అందుకాయన థాంక్యూ, కానీ నా సినిమాల్లో నాకు విలన్లంటేనే ఎక్కువ ఇష్టం అని రిప్లై ఇచ్చాడు.

**మొదట్లో భయపడ్డా..**

రాజమౌళి అభిమానిగా నేను కూడా వారణాసి మూవీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఇందులో హీరోగా చేయడానికి నేను మొదట్లో భయపడ్డాను. కానీ ఆయన కథను వివరించి చెప్పాక ఆ భయం పోయింది. ఇందులో రాముడి పాత్ర పోషించాను. రాముడు అంటేనే హుందాతనం. నిలబడే దగ్గరనుంచి పాత్రలో నటించేవరకు ఎన్నో రిహార్సల్స్ చేశాం అని చెప్పాడు. తనకు ఇష్టమైన వంటకం ఏంటని అడగ్గా హైదరాబాదీ చికెన్ బిర్యానీ ఇష్టమని మహేశ్‌బాబు తెలిపాడు.



## 'బుల్లెట్ సునీల్'గా యాంగ్రీ మ్యాన్ రాజశేఖర్!

నారి నారి నడుమ మురారి సినిమాతో సూపర్ హిట్ అందుకున్న శర్వానంద్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'బైకర్'. ఈ చిత్రం నుంచి తాజాగా ఒక అదిరిపోయే అప్‌డేట్ వెలువడింది. ఈ చిత్రంలో సీనియర్ హీరో, యాంగ్రీ మ్యాన్ డాక్టర్ రాజశేఖర్ ఒక పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తుండగా, ఆయన బర్త్‌డే సందర్భంగా చిత్రబృందం మూవీ నుంచి స్పెషల్ టీజర్‌ను విడుదల చేసింది. ఈ సినిమాలో రాజశేఖర్ 'బుల్లెట్ సునీల్' అనే బైక్ రేసర్ కోచ్ పాత్రలో కనిపించబోతున్నాడు. విడుదలైన టీజర్‌లో బుల్లెట్ సునీల్ రికార్డ్స్ గురించి అతడి కెరీర్ గురించి ఎలివేషన్ ఇవ్వడం ఆసక్తికరంగా సాగింది. అభిలాష్ రెడ్డి కంకరా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం స్పోర్ట్స్, యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో సాగనుంది. శర్వానంద్ ఒక ప్రొఫెషనల్ బైక్ రేసర్‌గా కనిపిస్తుండగా.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ మూవీలో శర్వానంద్, రాజశేఖర్ మధ్య వచ్చే సీక్వెన్స్ సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. చాలా కాలం తర్వాత రాజశేఖర్ ఒక విభిన్నమైన రోల్‌లో మెరవనుండటంతో అతడి అభిమానులు ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.


## పోలీసులను ఆశ్రయించిన ఈషా రెబ్బ



**హైదరాబాద్:** తెలుగు హీరోయిన్ ఈషా రెబ్బ పోలీసులను ఆశ్రయించింది. తనపై సోషల్ మీడియాలో అసభ్య కామెంట్స్ చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈషా రెబ్బ పెట్టిన పోస్ట్‌కు ఓ వ్యక్తి అసభ్యంగా కామెంట్ పెట్టాడు. దీంతో పోలీసులను ఆశ్రయించిన ఈషా.. అతడి ఐడీతో పాటు కామెంట్‌ను చూపించింది.

**కేసు నమోదు**

ఆమె ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఒక వ్యక్తి ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసి ఇలా చెండాలంగా కామెంట్స్ పెట్టినట్లు గుర్తించారు. ప్రస్తుతం కేసు విచారణ జరుపుతున్నారు. కాగా ఈషా రెబ్బ.. ఇటీవల 'ఓం శాంతి శాంతి శాంతిః' సినిమాలో నటించింది.



# చిరు కుమార్తెగా సారా

ఈ మధ్య కాలంలో అద్భుతమైన సక్సెస్ అందుకున్న సినిమా 'ధురంధర్'. గత డిసెంబరులో రిలీజైనప్పుడు ఇప్పుడు ఓటీటీలోకి వచ్చిన తర్వాత మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. ఇందులో నటించిన రణ్‌వీర్ సింగ్, అక్షయ్ ఖన్నా, మాధవన్, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్.. ఇలా అందరికీ మంచి పేరు వచ్చింది. హీరోయిన్‌గా చేసిన సారా అర్జున్ కూడా ఓవర్ నైట్ స్టార్‌డమ్ సొంతం చేసుకుంది. ఇప్పుడు ఈమె.. చిరంజీవి కూతురిగా నటించే బంపరాఫర్ కొట్టేసిందట. ఈ సంక్రాంతికి 'మన శంకరవరప్రసాద్' సినిమాతో హిట్ కొట్టిన చిరంజీవి.. త్వరలో 'విశ్వంభర'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. మరోవైపు బాబీతో మరోసారి కలిసి పనిచేయనున్నాడు. గతేడాదే ఈ ప్రాజెక్టుపై ప్రకటన వచ్చింది. ఇంకొన్ని రోజుల్లో ఈ మూవీ సెట్స్‌పైకి వెళ్లనుంది. ప్రస్తుతం నటీనటుల ఎంపిక, ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. ఇందులో భాగంగా సినిమాలో ఎవరెవరు నటిస్తారనే వివరాలు బయటకొస్తున్నాయి. ఇందులో చిరుకి జోడీ ప్రియమణిని ఎంపిక చేశారని.. మోహన్ లాల్ కీలక పాత్ర కోసం తీసుకున్నారని.. విలన్‌గా బాలీవుడ్ దర్శకనటుడు అనురాగ్ కశ్యప్ కనిపించబోతున్నారని అంటున్నారు. అలానే కీలకమైన హీరో కూతురి పాత్ర కోసం 'ధురంధర్' ఫేమ్ సారా అర్జున్‌ని ఫైనల్ చేశారని మాట్లాడుకుంటున్నారు. తొలుత ఈ పాత్ర కోసం కృతి శెట్టి పేరు కూడా వినిపించింది కానీ సారా ఫైనల్ అయినట్లు ఉంది. సారా నటించిన తొలి తెలుగు మూవీ 'యుఫోరియా'.. ఈ శుక్రవారం థియేటర్లలోకి రానుంది.





## 'వారణాసి'లో విలన్‌గా
# పృథ్వీరాజ్ సుకుమారన్..

దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి సినిమాల్లో హీరో ఎంత శక్తివంతంగా ఉంటాడో, విలన్ పాత్ర కూడా అంతే బలంగా నిలుస్తుంది. అదే ట్రెండ్‌ను కొనసాగిస్తూ మహేష్ బాబు హీరోగా రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి' లో విలన్ పాత్ర కోసం మలయాళ స్టార్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్‌ను ఎంపిక చేయడం సినీ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. తాజాగా హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన పాత్ర 'కుంభ' గురించి పృథ్వీరాజ్ వెల్లడించిన విషయాలు సినిమాపై అంచనాలను మరింత పెంచుతున్నాయి. ఈ సినిమాలో పృథ్వీరాజ్ 'కుంభ' అనే ప్రతినాయక పాత్రలో కనిపించనున్నారు. తన కెరీర్‌లో ఇదే అత్యంత విభిన్నమైన, అంచనా వేయలేని పాత్ర అని ఆయన తెలిపారు.

సాధారణంగా మంచి-చెడు అనే స్పష్టమైన రేఖలతో ఉండే పాత్ర కాకుండా, ఈ కుంభ క్యారెక్టర్ పూర్తిగా గ్రే షేడ్స్‌తో సాగుతుందని చెప్పారు. ఎప్పుడు ఏం చేస్తాడో ప్రేక్షకులు ఊహించలేని విధంగా ఈ పాత్రను డిజైన్ చేసినట్లు వెల్లడించారు. తన నిజజీవితానికి పూర్తిగా భిన్నమైన డార్క్ రోల్ కావడం వల్ల ఇది తనకు పెద్ద ఛాలెంజ్‌గా మారిందన్నారు. రాజమౌళి దర్శకత్వ శైలి గురించి కూడా పృథ్వీరాజ్ ఆసక్తికర విషయాలు చెప్పారు. జక్కన్న సెట్స్‌లో నటీనటులు ఎప్పుడూ కంఫర్ట్ జోన్‌లో ఉండరని, ప్రతి సీన్‌లో కొత్త ఛాలెంజ్ విసురుతూ నటుల నుంచి అత్యుత్తమ నటన రాబడతారని తెలిపారు. ఆ ఒత్తిడి వల్లే సహజమైన ఎమోషన్స్ బయటకు వస్తాయని, అదే రాజమౌళి పర్ఫెక్షన్ సీక్రెట్ అని పేర్కొన్నారు. ఒక సీన్ పక్కాగా వచ్చే వరకు వదలరని ఆయన అన్నారు.

సినిమాలో కుంభ గెటప్ కూడా చాలా ప్రత్యేకంగా ఉండబోతోందని టాక్ వినిపిస్తోంది. అత్యాధునిక టెక్నాలజీతో కూడిన వీల్‌చైర్, 'డాక్టర్ ఆక్టోపస్' తరహాలో రోబోటిక్ చేతులు వంటి ఎలిమెంట్స్‌తో పృథ్వీరాజ్ లుక్ భయానకంగా ఉండనుందని సమాచారం. కేవలం కళ్లతోనే భయపెట్టే విధంగా ఈ పాత్రను డిజైన్ చేశారనే ప్రచారం జరుగుతోంది. భారతీయ సినిమాల్లో ఇప్పటివరకు చూడని సైకలాజికల్ విలన్‌గా 'కుంభ' నిలుస్తాడని సినీ వర్గాలు భావిస్తున్నాయి. భారీ సెట్లు, గ్రాఫిక్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు ఉన్నప్పటికీ రాజమౌళి మాత్రం నటుల ఎక్స్‌ప్రెషన్స్‌కే మొదటి ప్రాధాన్యం ఇస్తారని పృథ్వీరాజ్ వెల్లడించారు. ఒక క్లోజప్ షాట్‌లో నటుడు ఇచ్చే భావ వ్యక్తీకరణే సినిమాకు ప్రాణం అని జక్కన్న నమ్ముతారని చెప్పారు. ఎంత పెద్ద యాక్షన్ సీన్ జరిగినా, నటుడి ముఖంలో చిన్న మార్పును కూడా కెమెరాలో బంధించేందుకు రాజమౌళి ఎక్కువ సమయం కేటాయిస్తారని వివరించారు. మొత్తానికి 'వారణాసి'లో హీరో మహేష్ బాబు పోషిస్తున్న 'రుద్ర' పాత్రకు సమానంగా నిలిచే 'కుంభ' విలన్ పాత్ర సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచే అవకాశముంది.

# మగబిడ్డ వ్యాఖ్యపై విమర్శలు
## చిరు ఎలాంటి వారో చెప్పిన లావణ్య

2026 మెగా ఫ్యామిలీకి బాగానే కలిసొచ్చినట్లు కనిపిస్తోంది. సంక్రాంతికి 'మన శంకరవరప్రసాద్' సినిమాతో వచ్చిన చిరంజీవి.. చాన్నాళ్ల తర్వాత అద్భుతమైన హిట్ కొట్టారు. జనవరి చివరి రోజున చిరు మరోసారి తాత అయ్యారు. రామ్ చరణ్-ఉపాసన దంపతులకు కవలలు(మగబిడ్డ, ఆడబిడ్డ) పుట్టారు. రెండు మూడు రోజుల క్రితం ఈ న్యూస్ తెగ వైరల్ అయింది. అదే టైంలో చిరు గతంలో 'మెగా వారసుడి' అంటూ కొన్ని కామెంట్స్ చేశారు. ఇప్పుడు వాటిని తీసుకొచ్చి చిరంజీవిపై దారుణమైన ట్రోలింగ్ చేస్తున్నారు. వీటిపై మెగాకోడలు లావణ్య త్రిపాఠి స్పందించింది. స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. మెగా కుటుంబంలో ఇప్పటి జనరేషన్‌లో దాదాపు అందరూ అమ్మాయిలే ఉన్నారు. దీని గురించి గతంలో ఓ సందర్భంలో మాట్లాడిన చిరు.. మెగా లెగసీని ముందుకు తీసుకెళ్లే వారసుడి కోసం ఎదురుచూస్తున్నాను అని అన్నారు. ఆ వ్యాఖ్యలపై ఇప్పుడు ట్రోలింగ్ చేస్తున్న కొందరు.. ఆడపిల్లలు, మహిళలని చిరంజీవి చులకనగా చూస్తున్నారని విమర్శలు చేస్తున్నారు. దీనిపై స్పందించిన లావణ్య.. ఇలాంటి చీప్ కామెంట్స్ ఊహించలేదని ఒక యూజర్‌కి గట్టిగా ఇచ్చిపడేసింది. 'సాధారణంగా ఇలాంటి ట్వీట్లని పట్టించుకోకుండా వదిలేస్తాను. ఈసారి మాత్రం స్పందించక తప్పలేదు. ఓ సంతోషకరమైన క్షణాన్ని ఇలా విషపూరితంగా మార్చడం చాలా నీచమైన ఆలోచన. చిరంజీవి కుటుంబంలోని మహిళలని, ముఖ్యంగా తన మనవరాళ్లని ఎంత ప్రేమగా, గౌరవంగా చూస్తారో.. ఈ విమర్శలు చేసేవారికి అసలు అవగాహన లేదు. చిరంజీవి తన కుటుంబానికి ఇచ్చే విలువ చాలామందికి సాధ్యం కాదు. ఆయన చేసే పనుల్లో 1 శాతం కూడా చేయలేని వాళ్లు.. ఆయన వ్యక్తిత్వంపై వ్యాఖ్యలు చేయడం సరికాదు' అని లావణ్య ట్వీట్ చేసింది. ఈమె ట్వీట్ చేసిన కాసేపటికే.. సదరు యూజర్ తన ట్వీట్ డిలీట్ చేశాడు.



EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034